# అపరాధి



చేతిలో పెద్ద రాయి. ఎప్పుడూ తను తేలిగ్గా దూరంగా విసిరేస్తున్నదే. కానీ, ఇవాళెందుకో ఆ రాయి చేతికి అతుక్కుపోయినట్టు - ఎంత బలంగా ప్రయత్నించినా విసరలేకపోతున్నాడు! మళ్లీ బలమంతా ఉపయోగించి రాయి విసిరాడు. ఈసారి అది చేతినుంచి వేరై దూరంగా పడి దొర్లసాగింది. అంతలోనే రాయి చక్రంగా మారింది. వేగంగా దొర్లుతూ.... ఎదురుగా తెల్లటి పువ్వు. దాని మీదగా దొర్లింది. పువ్వు పూర్తిగా నలిగిపోయింది. దాని కన్నీళ్లు ఎర్రగా ఉన్నాయి. హఠాత్తుగా ఎక్కణ్ణుంచో ఒక ఎర్రటి కుక్క భయంకరంగా మొరిగి తన వెంట పడింది. తను భయంతో పరిగెత్తుతున్నాడు. పరిగెత్తీ.... పరిగెత్తీ.... చివరికి ఆగిపోయాడు. కాళ్లు నేలకి అతుక్కుపోయినట్టు కదలటం లేదు. కదలాలనే ప్రయత్నం... అసాధ్యం.... కుక్క ఇంకా

వేగంగా వస్తోంది. బలమంతా ఉపయోగించినా, అడుగు ముందుకు పడటం లేదు. శరీరానికి దగ్గరగా భయంకరంగా ఆ ఎర్రటి కుక్క...

"ఊఁ.....ఊఁ.....హూఁ....." ఒక్క కలవరింతతో గబుక్కున లేచి కూర్చున్నాడు మధు.

గొంతు తడారిపోయింది. ఒళ్లంతా చెమటలు. బెడ్ పక్క టీపాయ్ మీద మంచినీళ్ల గ్లాసు తీసుకుని గటగటా తాగాడు. కొంచెం తేరుకున్నాడు. బెడ్ లైట్ చిరుకాంతిలో గోడ గడియారం రెండూ ఇరవై చూపిస్తోంది. ఇల్లంతా శూన్య నిశ్శబ్దం. భయం గొల్పే నిశ్శబ్దం.

మళ్లీ నిద్ర పట్టలేదు. లేచి కిటికీ దగ్గరికి నడిచాడు. ఇంటి కానుకుని వరుసగా నిద్రిస్తున్న ఇళ్లు. నిద్రిస్తున్న ఆకాశం. మినుకు మినుకు నక్షత్రాలు. గాలి అల మీదగా కిటికీ బయట నైట్ క్వీన్ పూల వాసన. కానీ, ఆస్వాదించే స్థితి కాదు. ఎంత భయంకరమైన ఒంటరితనం? ఈ రాత్రి అరుణ తన పక్కనుంటే, ఊరట దొరికేదా? ఏమో?

మళ్లీ దూరంగా ఆకాశంలోకి చూపు సారించాడు. చుక్కలు తప్ప మరేమీ కనిపించటం లేదు. హఠాత్తుగా ఎక్కణ్ణుంచో 'హంతకుడా! హంతకుడా!' అనే కేక. ఎక్కణ్ణుంచి? తనలోంచే. హంతకుడేనా తను? ఆ పిల్లాడు చనిపోయాడా? బతికుంటే ఎంత బాగుండును. కానీ, ఎలా బతుకుతాడు? ఇప్పుడేం చేయగలడు తను? ఈ రోజు ఉదయం ఏం జరిగింది?....

❖ ❖ ❖

ఇంట్లో ఎవ్వరూ లేరు. భార్య అరుణ, కూతురు ఉమ, చిన్నవాడు కిట్టూ ఊరెళ్లారు. మామగారి ఊళ్లో చుట్టాల ఇంట్లో పెళ్లి, మార్చి నెల చివర హడావుడి కావటాన తనకి బ్యాంకులో సెలవు దొరకలేదు. ఇంట్లో అరుణ లేకపోయినా హోటల్‌కి వెళ్లే అలవాటు లేదు. వంట కాస్త తెలుసు. రాత్రి తల నొప్పితో ఆలస్యంగా నిద్ర పట్టింది. పొద్దున్నే లేవటానికి బద్ధకించాడు. పాలమనిషి ఆరింటికే వచ్చి బెల్ మోగించినా పాలగిన్నె అలమార్లో పెట్టి మళ్లీ ముసుగు తన్నాడు. మళ్లీ ఏడున్నరకిగాని మెలకువ రాలేదు. పనిమనిషి వచ్చి అంట్లు తోమి, బట్టలుతికి వెళ్లిపోయింది. వంట చేసుకుని భోజనం ముగించే పాటికి తొమ్మిదీ యాభై అయిదు.. ఇంకా ఐదు నిమిషాల్లో దాదాపు పది కిలోమీటర్లు - 'పీక్ అవర్'లో, ట్రాఫిక్ తప్పించుకుంటూ - రమణ నగర్ ఆంధ్రా బ్యాంక్‌కి చేరుకోటం అసాధ్యం. అయినా, వేగంగా వెళ్లాలి. అసలే ఇవాళ పెందలాడే రమ్మని మేనేజర్ చెప్పాడు.

బైక్ నాల్గో గేర్‌లోకి మార్చి స్పీడందుకునేలోగా ఒక కుక్క అడ్డం వచ్చింది. మధు అసహనంగా బ్రేక్ వేసేలోగానే తప్పుకుంది.(కుక్కలు చురుకైన జంతువులు.) మళ్లీ స్పీడందుకున్నాడు. ఈసారి ఏం అడ్డం వచ్చినా స్పీడు తగ్గించకూడదు. నేర్పుగా తప్పించు కోవాలి. కాలేజీ పరీక్షలకి సైకిళ్ల మీద, బైక్‌ల మీద వెళ్లే కుర్రాళ్లు ఎదురవుతున్నారు.

స్పీడ్....స్పీడ్.......స్పీడ్...... ట్రాఫిక్ ఏమంత లేకుంటే ఎంత స్పీడ్‌గా వెళ్ళినా బాగానే ఉంటుంది. వెధవది సరిగ్గా ఇప్పుడే అందరికీ హడావిడి. అందునా సిటీబస్‌లు, ఆటోల గోల. సిటీ బస్ వెనక వస్తున్నా ప్రమాదమే. ముందు వెళ్తున్నా ప్రమాదమే. పోతూ పోతూ ఇంత దుమ్ము, పొగ మొగాన చిలకరించి పోతుంది.... అదుగో వెనకాల సిటీ బస్. పొగతో, దుమ్ముతో.... ఎంత చిరాకో? ఇందాకేగా ఫలానా తార వాడే సబ్బుతో హాయిగా స్నానించింది? ముందుకు దూకించాడు బైక్‌ని. అల్లంత దూరంలో గాంధీ టవర్ సెంటర్. రెడ్ సిగ్నల్. ఆగాలి, ఆగాలి. లేకపోతే పోలీసు ఊరుకోడు. మళ్లీ బ్రేక్.

చూపులు బెదురుగా వాచీ మీదికి మళ్ళాయి. పదీ పది. ఇంకా రెండు సిగ్నల్స్ దాటాలి. గజిబిజిగా, బిజీ బిజీగా ఉండే సన్నటి బోస్ రోడ్డు గుండా కిలోమీటర్ పోవాలి. కనీసం మరో పది నిమిషాలు. ఎలా? అసలే క్యాష్ కౌంటర్లో పని. పైగా లోన్స్ రికవరీ పనులు. లేటుగా వెళ్లటం తనకి అలవాటే లేదు. మేనేజర్ ఏమనకపోయినా, తనకే చిన్నతనం. నాల్గో తరగతి చదువుతున్న కిట్టూగాడికున్న ఇంగిత జ్ఞానం కూడా లేదా తనకి? స్కూలు తొమ్మిదింటికైనా ఎనిమిది దాటినప్పట్నుంచీ ఎంత హడావిడి చేస్తాడు? స్కూల్ రిక్షా కోసం పావు గంట ముందునుంచే ఎదురుచూస్తుంటాడు. మరి తను?.... తన మీద తనకే చిరాకేసింది మధుకి. అసహనంగా యాక్సిలేటర్ తిప్పాడు.

బోస్ రోడ్డు మలుపు వచ్చింది. ఆ సన్నటి రోడ్డు బ్యాంక్‌కి దగ్గర దారి. వచ్చేపోయే వాహనాల్ని, మనుషుల్నీ తప్పించుకుంటూ వెళ్లటం ఎంతో ఇబ్బంది. తన నేర్పంతా ఉపయోగిస్తూ నడుపుతున్నాడు బైక్‌ని. ఏభై... అరవై..... అయిదు.... చూపిస్తోంది స్పీడోమీటర్. స్పీడ్... టెన్షన్... స్పీడ్.... హఠాత్తుగా పక్క సందులోంచి ఒక బంతి దొర్లుకుంటూ.... బంతే గదా! మధు బ్రేక్ వేయలేదు. ఆ వెనకే ఒక పిల్లాడు పరిగెత్తుకుంటూ బంతి కోసం.... మధు ఊహించలేదు. మెదడేదో ప్రమాదాన్ని శంకించింది. ఎలర్ట్ కావాలి...పిల్లవాణ్ణి తప్పించాలి. సాధ్యం కానంత దగ్గరగా.... బ్రేక్ వెయ్యాలి. వేసేలోగా.... బైక్ దాటిపోయేలోగా గుద్దేసింది.

"అమ్మా!" పిల్లాడి ఆర్తనాదం.

సడెన్ బ్రేక్‌తో కీచుమంటూ గిర్రున పక్కకి తిరిగి అల్లంత దూరంలో ఆగింది బైక్. ఇంజన్ ఆగలేదు. మధు దిమ్మెరపోయాడు.

'అరెరె!' అంటూ.... 'అయ్యో!' అంటూ.... 'యాక్సిడెంట్!' అంటూ....ఎవరెవరో.

"అమ్మా! అమ్మా! ఓ....." ఆర్తనాదం.

గందరగోళం. జనం మూగుతూ.... ట్రాఫిక్ జామ్.... నెత్తురు మడుగులో ఆ పిల్లాడు...... మధు బైక్ స్టాండ్ వెయ్యబోయాడు.

"అడుగో అతనే! ఆ బైకే!" దోషిని చూపిస్తూ భయపెట్టే గొంతు.

మధు కంపించిపోయాడు. ఆలోచించే వ్యవధి లేదు. బ్యాంకికి ఆలస్యమా? జనం మధ్య నేరస్థుడుగా తనకి ప్రమాదమా? లేదా అదంత పట్టించుకోవాల్సిన విషయం కాదా?.... ఏమో....క్షణాల మీద బైక్ ఎక్కి, యాక్సిలేటర్ పెంచుతూ, గేర్లు మార్చుతూ.... బండి ముందుకు దూకింది.

"అరెరె! రాస్కెల్ పోతున్నాడు, పోతున్నాడు, ఆపండి!"

"నెంబర్! బండి నెంబర్ చూడండి!"

బండి ఆగలేదు. మధు వెనక్కి తిరిగి చూడలేదు. తన గుండె చప్పుడు తనకే వినిపిస్తోంది. మరో రెండు నిమిషాల్లో బైక్ బ్యాంక్ ఆవరణలో ఆగింది.

లోపలికి ఎలా వచ్చాడో, మేనేజర్ ఏమన్నాడో, ఎలా డబ్బు కట్టలు రిసీవ్ చేసుకున్నాడో, క్యాష్ కౌంటర్‌లోకి ఎలా వచ్చి కూర్చున్నాడో? అంతా మెదడుతో ప్రమేయం లేకుండానే జరిగిపోయి నట్టుంది. కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నాడు. కౌంటర్ ముందు కస్టమర్లు చేరుతున్నాడు. ఏళ్లతరబడి అలవాటైన పని గనక అర్ధ చైతన్యంతోనే చెక్కులు, విత్ డ్రాయల్స్ తీసుకుని నోట్ చేయటం, టోకెన్‌లు తీసుకోవటం, నోట్లు లెక్క పెట్టి ఇవ్వటం - అన్నీ యాంత్రికంగా జరిగిపోతున్నాయి. కానీ, మనసు నిండా గజిబిజి.... ఆందోళన. నెత్తురు మడుగులో ఆ పిల్లాడు! బైక్ పొట్ట మీదగా పోయిందా? కాలు మీదగానా? ఎంత రక్తం! చనిపోతాడా?

తన ఆలోచనకి తనకే భయం వేసింది. గొంతెండిపోయి నాలుక పిడచగట్టుకు పోయింది. మంచినీళ్లు తెప్పించుకుని తాగాడు. అంతరంగంలో ఏదో నిస్సహాయ ఆక్రోశం.

"సార్!"

ఉలిక్కిపడి తలెత్తి చూశాడు. అంతకుముందే డబ్బు తీసుకున్న మనిషి.

"వంద రూపాయలు ఎక్కువిచ్చారు" అంటూ నోట్లబొత్తి అందించాడు.

చెక్ మీద అంకె మరోసారి చూసి నోట్లు లెక్కపెట్టాడు. ఒక నోటు ఎక్కువ ఉంది. దాన్ని సొరుగులో వేసి, 'థాంక్స్' చెప్పి, డబ్బిచ్చాడు. అతను నవ్వి వెళ్లిపోయాడు.

ఆ పిల్లాడు చనిపోయాడేమో! ఎంత నెత్తురు! చనిపోతే ఎలా? చూసినవాళ్ళు రిపోర్ట్ ఇవ్వకుండా ఉంటారా? తను ఆగకుండా వచ్చేటప్పుడు ఎవరో బండి నెంబర్ చూడమనటం గుర్తుకొస్తోంది. పెద్ద పెద్ద అంకెల్తో వేయించిన నంబర్. ఇప్పుడెట్లా? పోలీసులు తప్పకుండా తన బైక్ కోసం వెతుకుతుంటారు. ఏం చెయ్యాలి? ఎలా తప్పించుకోవాలి? మైగాడ్!

మధు ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి. పైన ఫ్యాన్ తిరుగుతున్నా ఊపిరాడటం లేదు. ఒక్కసారి తలెత్తి చూశాడు. కొత్త లోకాన్ని చూస్తున్నట్లుగా ఉంది. అంతా మామూలే.

ఎడమ పక్క రిసీవింగ్ కౌంటర్లో నాగబ్రహ్మం సీరియస్‌గా చలానా స్లిప్‌లూ, డబ్బూ తీసుకుంటూ లెక్కపెడుతూ స్లిప్‌ల మీద టకటకా స్టాంప్‌లు వేస్తూ బిజీగా ఉన్నాడు. అటువైపు సుబ్రహ్మణ్యం పాస్ బుక్‌లూ, విత్‌డ్రాయల్సూ, చెక్‌లూ తీసుకుంటూ, ఎంట్రీలు వేస్తూ, టోకెన్‌లు ఇస్తూ ఉన్నాడు. మేనేజర్ చాంబర్‌లో ఎవరో ఇద్దరు కస్టమర్లు మాట్లాడుతూ.... ఎవ్వరికీ తన మనసులో రేగే తుఫాను సంగతి తెలీదు. సన్నగా తలనొప్పి, తల పట్టుక్కూర్చున్నాడు ఒక్క నిమిషం.

"హలో!"

ఉలిక్కిపడి తలెత్తి చూశాడు. ఎదురుగా యూనిఫాంలో సబ్‌ఇన్‌స్పెక్టర్ అయి ఉండాలి. నిలడి ఉన్నాడు. తనవంకే సూటిగా చూస్తున్నాడు. మధు ముఖం పాలిపోయింది. స్టాఫ్, కస్టమర్లు అంతా తన వంకే చూస్తున్నట్టనిపించింది.

"హలో! మిమ్మల్నే సార్! క్యాష్ ఇస్తారా?" కౌంటర్ కంతలోంచి అద్దం మీద టోకెన్ పెడుతూ మర్యాదగా అడిగాడతను.

ఒక్క క్షణం మధుకేమీ అర్థం కాలేదు. మరుక్షణం తేరుకున్నాడు. ఓహ్! అతడు డబ్బు విత్‌డ్రా చెయ్యటానికి వచ్చాడు కానీ, పోలీసుగా రాలేదు. ఒక్కసారి గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నాడు. పక్కనే స్లిట్‌లోంచి చెక్ తీసుకుని, ఎంట్రీ వేసి, నోట్లు లెక్కపెట్టి ఇచ్చాడు.

ఇన్‌స్పెక్టర్ ద్వారం దాటి బయటికి వెళ్లేదాకా అటే చూస్తూ ఒక్క నిట్టూర్పు విడిచాడు మధు. తన అకారణభయానికి తనకే నవ్వొచ్చి, మనసు తేలిక పడడానికై పైకే నవ్వాడు. పక్క ఛాంబర్‌లోంచి నాగబ్రహ్మం తల తిప్పి ఆశ్చర్యంగా చూశాడు.

"ఏం బ్రదర్, ఇవాళ వింతగా కనబడుతున్నావ్. ఏంటి సంగతి?" అడిగాడు. నవ్వుతూ. "అవునూ, మొహమేంటి అట్లా కందిపోయింది?" అన్నాడు మళ్ళీ పరీక్షగా చూస్తూ.

మధు ఉలిక్కిపడ్డాడు. "అబ్బే, ఏం లేదు, బాగానే ఉన్నాను" అన్నాడు తొందరగా.

మధ్యాహ్నానికి బాగా తలనొప్పి వచ్చింది. టాబ్లెట్స్ తెప్పించుకుని కాఫీ తాగాడు. అయినా, ఒళ్లంతా నీరసం.. అలాగే లెక్కలు పూర్తి చేసి, మర్నాటికి సెలవు పెట్టి టైం కాగానే బయటపడ్డాడు. కాళ్లు అలవాటుగా స్కూటర్ స్టాండ్ వైపు నడిచాయి. బైక్‌ని చూడగానే ఒళ్లంతా జలదరించింది. భయంతో కూడిన అసహనం. 'ఎలా ఉందో, యముడి దున్నలాగా' అనుకున్నాడు. రెండేళ్ల కిందట మోజుపడి కొనుక్కున్న బండే. 'నేరేడు రంగులో నిగనిగలాడుతూ ఎంత బాగుందో బుజ్జి ముండ' అనుకున్న బండే. కానీ, ఇప్పుడు? నెత్తురు మరకలంటిన బండి. ముట్టుకుంటే ఆ స్పర్శ ఎలాగో ఉంది. స్టార్ట్ చేసి బజార్లోకి వచ్చాడు. ఒక్కసారిగా ఏదో వింతలోకంలో అడుగు పెట్టినట్టుగా ఉంది. వేగంగా నడుస్తూ అటూ ఇటూ వెళ్తున్న జనం, బస్సులు, కార్లు, స్కూటర్లు, సైకిళ్లు. ఎక్కణ్ణుంచో ఏవో అదృశ్య నేత్రాలు తనని దోషిగా పరీక్షగా చూస్తున్న అనుభూతి.

ఇలా బైక్ ఇంటికి వేసుకెళ్లటం కంటే ఇక్కడే ఎక్కడైనా వదిలేస్తే మంచిది. ఎక్కడ?... అక్కడికి ఫర్లాంగు దూరంలో ఉన్న షబ్బీర్ మెకానిక్ షెడ్ గుర్తొచ్చింది. ఎప్పుడన్నా చిన్న చిన్న రిపేర్లొస్తే, బండి అక్కడే ఇస్తుంటాడు. నేరుగా వెళ్లి షబ్బీర్ కప్పజెప్పాడు బండిని. సర్వీసింగ్ చేయించి, కార్బొరేటర్ క్లీన్ చేసి, బ్రేకులు చెక్ చేసి ఉంచమని చెప్పాడు.

వీధిలోకి రాగానే కొంత 'రిలీఫ్'. ఆటోలో ఇంటికి చేరాడు. ఆరు గంటలైంది. పక్క వాటా ముసలమ్మ చెప్పింది. "ఇందాక నీ కోసం ఎవురో వొచ్చెల్లారయ్యా!"

మధు గతుక్కుమన్నాడు. పోలీసులకి తన ఆచూకీ తెలిసిపోయిందా? "ఎ....ఎవరు?"

"ఏదో పేరు చెప్పాడయ్యా! అదేంటీ....ఆఁ, గోపాలరావంట. సన్నగా, పొడుగ్గా ఉన్నాడు."

ఊపిరి పీల్చుకున్నాడు మధు. గోపాలరావు పరిచయస్థుడే. బ్యాంక్ లోన్ ఇప్పించమని తిరుగుతున్నాడు. తలుపు తాళం తీసి హాల్లోకి నడిచి పడక్కుర్చీలో కూలబడ్డాడు. ఇల్లంతా బోసిగా, శూన్యంగా ఉంది. మనసూ అలాగే.... ఆందోళన, బాధ. కళ్లు మూసుకుంటే అదే దృశ్యం.... నెత్తురు మడుగులో పిల్లాడు.... కడుపులో దేవుతున్నట్టు. జ్వరంగా.... మగతగా.... ఎప్పుడు లేచి పక్కమీద పడుకున్నాడో? తిరిగి ఈ పీడ కలలోంచే మెలకువ. మళ్లీ నిద్ర పట్టలేదు.ఎప్పుడో తెల్లవజాముకి మెల్లగా మగతలోకి జారుకుంది మనసు.

❖ ❖ ❖

ఉదయం ఏడు గంటలకు మెలకువ వచ్చింది. నీరసం.... కొంచెంగా జ్వరం. కళ్లు ఎర్రబడి మండుతున్నాయి. కాసేపటికి పక్క వాటా ముసలమ్మ వచ్చి పాలగిన్నె ఇచ్చింది. పాల మనిషి కాలింగ్‌బెల్ మోగించి, ఎంతకీ తను లేవకపోతే పక్క ఇంట్లో పాలు పోసి, తనకివ్వమని చెప్పిందట.

ముఖం కడుక్కుని కాఫీ తాగుతుండగా, ఒక ఆలోచన.... బోస్ రోడ్డుకి వెళ్లి ఎవర్నైనా యాక్సిడెంట్ గురించి అడిగి తెలుసుకుంటే? బండి నెంబర్‌ని ఎవరైనా గుర్తు పట్టారా? ఒకవేళ ఆ పిల్లాడు బతికాడేమో? కనుక్కునే దాకా మనశ్శాంతి ఉండదు.

జ్వరం తగ్గలేదు. నూటరెండు డిగ్రీలుంది. రోజంతా పక్కమీదే అశాంతిగా అటూ ఇటూ దొర్లుతూ గడిపాడు. కొంచెం మగత. మగతలో రకరకాల ఆలోచనలు. భయంతో, బాధతో కూడిన ఆందోళన. 'నేను దోషిని. దోషినే కాదు, పిరికివాణ్ణి కూడా' అనుకున్నాడు. 'కాలం ఇప్పుడు ఒక రోజు వెనక్కి జరిగితే ఎంత బాగుండును? యాక్సిడెంట్ జరక్కుండా ఉంటే ఎంత మనశ్శాంతిగా ఉండేది? హంతకుడా! దురదృష్టవంతుడా! ఏది నీకు దారి?'

కనుచీకటి పడేటప్పుడు మధు ఓపిక తెచ్చుకుని బయటికి బయల్దేరాడు. బోస్ రోడ్డు మూలమీద బడ్డీ కొట్టుంది. అప్పుడప్పుడూ తను అక్కడే ఆగి సిగరెట్లు తీసుకుంటాడు. కొట్టు

కుర్రాడు హుషారైనవాడు. అక్కడికి నడిచి సిగరెట్ ప్యాకెట్ తీసుకుని మామూలుగా అడిగాడు, నిన్నటి యాక్సిడెంట్ గురించి.

"ఎవడో సార్! గుద్దేసి వెళ్ళిపోయాడు. బైక్ నెంబర్ కూడా ఎవరూ గుర్తుపట్టలేదు."

మధు మనసు కుదుటపడింది. 'బండి నెంబర్ గుర్తుపట్టలేదంటే యాక్సిడెంట్ తను చేసినట్టు ఎవరికీ తెలీదు. ఓహ్! ఎంత హాయిగా ఉందిప్పుడు?' సిగరెట్ తీసి వెలిగించాడు.

"మరి ఆ పిల్లాడికి..." అడిగాడు తడబాటుగా.

"పాపం, స్పృహ తప్పి పడిపోయాడు. తలకి దెబ్బ తగిలింది. బాగా రక్తం పోయింది. హాస్పటల్‌కి తీసుకెళ్ళారు. బతుకుతాడో లేదో?" చెప్పాడా కుర్రాడు.

మధు మనసులో మళ్ళీ గాయం రేగింది. తీరని విచారంతో స్థాణువులా అలాగే నిలబడిపోయాడు. సిగరెట్ వెగటనిపించింది. దూరంగా పారేసి, మళ్ళీ అతనితో అన్నాడు.

"ఆ పిల్లాడు బతికాడో లేదో కాస్త కనుక్కుంటావా?"

"దానికేముంది సార్! నాక్కూడా బాధగా ఉంది. తప్పకుండా కనుక్కుంటాను" అన్నాడు.

మధు అక్కడ నిలబడలేక ముందుకు నడిచాడు. ఆ సాయంకాలపు పట్టణ జనం మధ్య తనొక్కడే ఏకాకిగా.... అలా నడుస్తుంటే బండి సంగతి గుర్తొచ్చింది. షెడ్ దాకా వెళ్ళి బండి తీసుకున్నాడు. నీట్‌గా.... ఏ యాక్సిడెంట్ ఎరగనట్టుగా.... అమాయకంగా ఉంది.

ఇంటికెళ్ళి వంట చేసుకునే ఓపిక లేదు. అన్నం తినాలనీ లేదు. కోమల విలాస్ దగ్గర ఆగి రెండు ఇడ్లీలు తిని, కాఫీ తాగాడు. ఒంట్లో కాస్త చురుకుదనం. దార్లో కృష్ణారావు కనిపించాడు. సైకిల్ మీద ఎక్కడికో వెళ్తున్నాడు. బైక్ ఆపాడు తను. "ఇంటికేనా? చానాళ్లయింది కలుసుకుని. ఏమిటీ సంగతులు?" నవ్వుతూ అడిగాడు కృష్ణారావు.

తనకి మంచి స్నేహితుడు. ఇబ్బందుల్లో తోడుగా నిలబడగలవాడు. అరుణ ప్రసవించే సమయంలో తను భయపడ్డాడు. పిండం అడ్డం తిరిగిందన్నారు. సీరియస్ కేస్ అన్నారు. ఆ సమయంలో తనకి ధైర్యం చెప్పి, తనతోపాటు ఒక రోజంతా హాస్పిటల్ లోనే ఉన్నాడు. అప్పటినుంచీ అతనంటే తనకే కాదు, అరుణకీ ఎంతో అభిమానం. తను కుటుంబంలో ఒకడుగా కలసిపోయాడు.

అతని పలకరింపుకి సమాధానంగా ఏదో నసిగాడు. లోపల మాత్రం అతను కనిపించేసరికి కొంత మనసు నిలకడ చిక్కింది. అయినా, మనసు విప్పి యాక్సిడెంట్ సంగతి చెప్పలేకపోయాడు.

"ఏమిటోరా మధూ! ఒకే ఊళ్ళో ఉంటున్నా తరచు కలుసుకోలేకపోతున్నాం. అన్నట్టు వీనస్‌లో మంచి సినిమా వచ్చింది. వెళ్దామా?" అని అడిగాడు కృష్ణారావు.

"ఇప్పుడు మూడ్ లేదు లేరా?" అన్నాడు మధు.

"ఇవాళ కాకుంటే రేపో, ఎల్లుండో వెళ్దాం. అమ్మాయీ, పిల్లలూ ఏం చేస్తున్నారు?"

అరుణని 'అమ్మాయి' అనే అంటాడు కృష్ణారావు. వాళ్లు ఊరెళ్లినట్టు చెప్పాడు నరేంద్ర.

"అయితే, భోజనానికి మా యింటికి రారాదూ?"

"ఫర్వాలేదులే. వంట చేతనవునుగదా!"

"సరే, మళ్లీ కలుస్తాను" అని సైకిలెక్కాడు కృష్ణారావు.

మధు ఇల్లు చేరాడు. జ్వరం తగ్గినట్టు లేదు. మనసులో ఒక ఆందోళన తగ్గి మరో ఆందోళన ఎక్కువైంది. తను యాక్సిడెంట్ చేసిన సంగతి ఎవరూ గుర్తించలేదు. కాని ఆ పిల్లాడు చనిపోయి ఉండొచ్చుననే ఊహ భయంకరంగా తోస్తోంది.

రాత్రి తొమ్మిది గంటలకి ఫోనొచ్చింది. మామగారి ఊరునుంచి. అరుణ. కిట్టూకి నిన్నటి నుంచి బాగా జ్వరంగా ఉందనీ, ఈ రోజు కూడా తగ్గకపోతే హాస్పిటల్‌లో చేర్చామనీ, తనకేదో భయంగా ఉందనీ, వీలైతే బయల్దేరి రమ్మనీ ఆదుర్దాగా చెప్పింది. అంతలో ఫోను బావమరిది సత్యం తీసుకున్నాడు. మరేం కంగారు పడొద్దనీ, ఈ రాత్రికి జ్వరం తగ్గిపోతుందని డాక్టర్ చెప్పాడనీ (దూరాభారం గనుక) వెంటనే రానవసరం లేదనీ, మళ్లీ ఉదయాన్నే ఫోన్ చేస్తాననీ చెప్పాడు.

మధు డీలా పడిపోయాడు. రకరకాల భయాలు చుట్టుముట్టాయి. కిట్టూకి సీరియస్‌గా లేకపోతే ఎందుకు ఫోన్ చేస్తారు? తను వెళ్లగలిగితే బాగుండును. కానీ, ఇప్పట్లో రైలు లేదు. ఒంట్లో జ్వరమూ తగ్గలేదు.

ఒకవేళ కిట్టూకేమైనా అయితే తను భరించగలడా? ఇదంతా తను చేసిన యాక్సిడెంట్ ఫలితమా! దేవుడిట్లా తనని శిక్షిస్తున్నాడా? తనెప్పుడూ దేవుణ్ణి పెద్దగా పట్టించుకున్నది లేదు. అరుణ పూజలు, వ్రతాలూ చూసి ఎగతాళి చేస్తుండేవాడు. కానీ ఇప్పటి పరిస్థితి వేరు.

కాళ్లు దేవుడి గూడువైపు నడిచాయి. గూడు మధ్యలో వెంకటేశ్వరస్వామి పటం. అటు పక్క లక్ష్మీదేవి. ఇటుపక్క వినాయకుడి బొమ్మ. పసుపూ కుంకుమలు, సగంలో ఆరిపోయిన అగరొత్తి. చేతులు వణుకుతుండగా దేవుడికి నమస్కారం చేశాడు. 'భగవంతుడా! నా అపరాధం క్షమించు. కిట్టూ ప్రాణాలు కాపాడు.'

❖ ❖ ❖

రాత్రి ఎలా నిద్ర పట్టిందో. తెల్లారింది మొదలు సత్యానికి ఫోన్ కోసం ప్రయత్నం చేస్తుంటే లైన్ దొరకటం లేదు. బ్యాంక్‌లో ఉన్నంతసేపూ ఆందోళన తగ్గలేదు. సాయంత్రం తిరిగి వస్తుంటే ఎందుకో ఆ పిల్లాడి మరణానికి కిట్టూ బతుక్కీ ఏదో సంబంధం ఉందనిపించింది. అతను చనిపోకుండా ఉంటే ఎంత అదృష్టం! బడ్డీకొట్టు కుర్రాడు ఏం వార్త చెబుతాడో?

అంతలో మధుకి వింతైన ఆలోచన వచ్చింది. ఎంతోమంది మనుషులు స్కూటర్ల మీదా, సైకిళ్ల మీదా, నడుస్తూ ఎదురవుతున్నారు. బోస్ రోడ్డు చేరేదాకా ఏ మనిషీ నల్ల చొక్కాతో ఎదురుకాకూడదు. ఎదురు కాకపోతే ఆ పిల్లాడు బతికున్నట్టే లెక్క. ఎదురైతే చనిపోయినట్టు. బండి నడుపుతూ ఆ అంశం మీదనే తన బతుకంతా ఆధారపడి ఉన్నంత ఆందోళనగా చూస్తున్నాడు. గిరిపేట... మార్కెట్ బజార్... ఇంకాస్త దూరం పోతే బోస్ రోడ్డు. అప్పటిదాకా ఏ మనిషీ అట్లా ఎదురు కాలేదు. కానీ, బోస్ రోడ్డు మలుపు అల్లంత దూరంలో, సైకిల్ మీద ఎవరో, నల్లటి చొక్కాతో. మధు గుండె గతుక్కుమంది. అయ్యో! ఆ పిల్లాడు తప్పకుండా చనిపోయే ఉంటాడు. మరి కిట్టూ?

బండి బడ్డీ కొట్టు ముందు ఆగింది. కొట్టు కుర్రాడు సిగరెట్ పాకెట్ అందించాడు. తను అడిగేలోపు అతనే చెప్పాడు. "ఆ పిల్లాడికేమైందీ తెలీలేదండీ. ఇక్కడ హాస్పిటల్‌లో టెంపరరీగా ఏదో వైద్యం చేసి గుంటూరు తీసుకెళ్లమన్నారట."

మధు మనసులో తీవ్రత అలాగే ఉండిపోయింది. ఒక్క నిట్టూర్పు విడిచి బండి స్టార్ట్ చేశాడు. ఇంటికి వెళ్లగానే కిట్టూని చూడటానికి వెంటనే బయల్దేరాలని నిర్ణయించుకున్నాడు. ఆరున్నరకి ట్రెయిన్ ఉంది. తెల్లారేసరికి చేరతాడు. స్నానం చేసి బట్టలు సర్దుకుంటుండగా ఫోన్ మోగింది. సత్యం నుంచి. కిట్టూకి జ్వరం తగ్గిందనీ, ఆందోళన పడొద్దనీ చెప్పాడు. తర్వాత అరుణ కూడా సంతోషంగా మాట్లాడింది. వాడు కాస్త కోలుకోగానే బయల్దేరి వస్తామని చెప్పింది.

గుండెల మీద నుంచి పెద్ద బరువు దిగిపోయినట్టనిపించింది మధుకి. హుషారుగా కాఫీ పెట్టుకుని తాగి, చల్లగాలికి డాబా మీదికి వెళ్లాడు. హాయిగా ఉంది వాతావరణం. పొద్దు గూకుతుంది. పిట్టలు గూళ్లకి చేరుకుంటున్నాయి. పడమటి మబ్బులు ఎర్రబడ్డాయి. ఎర్రగా... అందంగా... కాదు.... రక్తంలా.... మధు మనసుని మళ్లీ దిగులు ఆవరించింది. ఎక్కణ్ణుంచో సన్నటి ఆర్తనాదం వినిపిస్తున్న అనుభూతి. 'అపరాధీ! నీకు నిష్కృతి లేదు.'

❖ ❖ ❖

ఉదయం ఎనిమిది గంటలప్పుడు కృష్ణారావు వచ్చాడు.

"సాయంత్రం నువ్వు మా ఇంటికొస్తున్నావు. అక్కణ్ణుంచి ఇద్దరం నీ బండిమీద సినిమాకి వెళతాం. (తప్పదు. ఇవాళే చివరిరోజు) రాత్రికి మా ఇంట్లోనే నీ భోజనం. అదీ సంగతి. వస్తాను" అని చెప్పి అలాగే సైకిలెక్కి వెళ్లిపోయాడు.

అతని ధోరణే అంత. మాటల తీరులోగాని, వ్యవహార సరళిలోగాని ఒక మృదువైన నిక్కచ్చితనం. ఎదటివాళ్లతో ఘర్షణ లేకుండాను, అదే సమయాన స్పష్టంగాను తన అభిప్రాయాలు వెల్లడించగలడు. నాగరికతాధూళి అతని హృదయాన్ని కప్పెయ్యలేక పోయింది.

సాయంత్రం పెందలాడే కృష్ణారావు ఇంటికి వెళ్ళాడు. ఒక మాదిరి ఇంట్లో చిన్న వాటాలో అద్దెకుంటున్నాడు. ఏదో ప్రైవేట్ కంపెనీలో కొద్దిపాటి ఉద్యోగం. తను వెళ్లేపాటికి కృష్ణారావు తయారై ఉన్నాడు. భార్య వైదేహి కాఫీలు ఇస్తూ "అన్నయ్యా! వదిన, పిల్లలు ఊరెళ్లారంటగా? ఎప్పుడొస్తారు?" అని అడిగింది.

మధు కిట్టూ జ్వరం సంగతి చెప్పి, రేపో మాపో వస్తారని చెప్పాడు.

"అట్టాగా? జ్వరం తగ్గింది కదా? వాళ్లు వచ్చిందాకా ఇక్కడే భోంచెయ్యండి" అన్నది.

మధు నవ్వి ఊరుకున్నాడు. తర్వాత స్నేహితులిద్దరూ బైక్ మీద సినిమాకి వెళ్లారు. ఎన్నో సినిమాలకి ఇంతకుముందు ఇద్దరూ కలిసే వెళ్లినా ప్రస్తుతం తనకేమీ ఆసక్తిలేదు.

కృష్ణారావు టికెట్లు తీసుకున్నాడు. హాల్లో పెద్దగా జనం లేరు. 'ద సెడ్యూస్డ్' సినిమా పేరు. జాక్సన్ అనే అతనికి భార్య, పిల్లలు ఉంటారు. ఒక వ్యాపార సంస్థలో మేనేజర్. అతని వద్ద 'మేరీ' అనే ఒక అందమైన అమ్మాయి ఉద్యోగంలో చేరుతుంది. జాక్సన్ ఆమెని ప్రలోభపెట్టి బలాత్కరిస్తాడు. మేరీ గర్భవతి అవుతుంది. ఇంట్లో వాళ్ల మాటలు భరించలేక, అబార్షన్‌కి ఒప్పుకోలేక, స్వయంగా నిలబడలేక, చివరికి ఆత్మహత్య చేసుకుంటుంది. ఆ వార్త తెలిసి జాక్సన్ విచారిస్తాడు. అతనిలో పశ్చాత్తాపం కలుగుతుంది. చివరికొక మత గురువు ద్వారా అతనికి ప్రశాంతి లభిస్తుంది. 'మనిషి దోషం చెయ్యటానికే పుడతాడు. అయితే, పశ్చాత్తాపం అతణ్ణి పునీతుని చేస్తుంది' అని సినిమా సారాంశం. జాక్సన్ పాత్రధారి తనలో కామప్రకోపాన్ని, ఆ తర్వాత అపరాధ భావనని, మానసిక సంఘర్షణనీ గొప్పగా ప్రదర్శించగలిగాడు.

హాల్లోంచి బయటికి వచ్చిన తర్వాత మధు మనసు బరువెక్కింది. "ఎలా ఉంది సినిమా" అన్న కృష్ణారావు ప్రశ్నకి జవాబివ్వలేకపోయాడు. తనూ దోషి. కానీ, దోషాన్ని అంగీకరించగలిగాడా? కనీసం మనసు విప్పి స్నేహితుడితో కూడా చెప్పుకోలేక పోయాడు.

తిరిగి వస్తుంటే కృష్ణారావు ఆ సినిమా గొప్పదనాన్ని విశ్లేషించి చెప్పసాగాడు. నరేంద్ర మనసు ఆ మాటల మీద నిలవలేదు. కృష్ణారావింట్లో అన్నం కూడా సహించలేదు.

"అన్నం సరిగ్గా తినటమే లేదు. వదిన, పిల్లల గురించి దిగులు పెట్టుకున్నావేమి టన్నయ్యా?" అని వేళాకోళమాడింది వైదేహి.

తిరిగి బయల్దేరే ముందు ఇంటి బయట కృష్ణారావుతో మధు జరిగిన సంగతంతా చెప్పాడు. "చాలా అశాంతిగా ఉంది. ఇది నా బలహీనతేమో తెలీదు. ఏం చెయ్యాలో పాలుపోవటం లేదు. నీ సలహా చెప్పరా?" అని బేలగా అడిగాడు.

కృష్ణారావు ఆత్మీయంగా మధు చెయ్యి నొక్కాడు. ఒక్క నిమిషం ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు. తర్వాత నెమ్మదిగా అన్నాడు.

"మంచి చెడ్డల్లో గాని, ప్రమాదాల్లో గాని మానవ బాధ్యత ఒక ముఖ్య విషయం. మనలో ఉండాల్సిన ఎన్నో మృదు లక్షణాలతో పాటు ఇది కూడా మెల్లగా ఆవిరైపోతుంది. ఆ మెత్తదనం నీలో ఇంకా మిగిలివుంది. అదే నీ బాధకి కారణం. తప్పు అంగీకరించలేకపోవటమే నీ ముందున్న సమస్య అనుకుంటా. అది అంగీకరించనంత కాలం నీకు మనశ్శాంతి ఉండదు. మనిషి తప్పు చేస్తాడు. మంచి మనిషి పశ్చాత్తాప పడతాడు. గొప్ప మనిషి దాన్ని సరిదిద్దుకుంటాడు. ఆలోచించు. అధైర్యపడవద్దు. నీ కోసం నేనున్నాను."

మధు మనసు కేదో కొంత దారి దొరికినట్టనిపించింది. ఒక్క క్షణం ఆగి, "వెళ్తాను" అన్నాడు కృష్ణారావుతో.

రాత్రి చాలాసేపు మథనపడ్డాడు మధు. కృష్ణారావు మాటలు నిజమే. తన అపరాధం అంగీకరించిన దాకా తనకీ ఘర్షణ తప్పదు. ప్రపంచం నుంచి తప్పించుకోగలిగాడు. కానీ, ఆత్మ నుంచి ఎలా తప్పించుకోవటం? రాయి కాదు గదా హృదయం? తనకి కిట్టూ ఎలాంటివాడో ఆ తల్లిదండ్రులకి ఆ పిల్లవాడూ అటువంటివాడే. ఆ పిల్లాడు జీవించినా మరణించినా తనిప్పుడు చెయ్యగలిగింది లేదు. కానీ, చేసిన తప్పునుంచి పారిపోయి ద్రోహి మాత్రం కాలేడు.

ఇలా నిశ్చయించుకున్న తర్వాత మధుకి హాయిగా నిద్ర పట్టింది.

❖ ❖ ❖

తెల్లారి నిద్ర లేస్తూనే మధు త్వరత్వరగా కాలకృత్యాలు తీర్చుకుని, బండి బయటికి తీశాడు. నేరుగా బోస్ రోడ్డుకి వెళ్లాడు. ఆ పిల్లాడి తల్లితండ్రుల గురించి అడుగుతూ పోయి చివరికి ఇల్లు తెలుసుకున్నాడు. ఒక పెంకుటింట్లో చిన్న వాటా అది. తాళం వేసి ఉంది. పక్క వాటా వాళ్లని అడిగాడు. అక్కడి ముసలాయన చెప్పాడు.

"హాస్పిటల్‌కి తీసుకెళ్లాం. ఏదో కట్టు కట్టి, ఇక్కడ లాభం లేదని, గుంటూరు తీసుకెళ్లమని చెప్పారు. వాళ్లమ్మ ఒక్కతే. భర్త లేడు. ఏదో కష్టపడి బతుకు వెళ్లమారుస్తుంటే, ఇప్పుడీ ఆపద వచ్చింది. మా వాడు కూడా తోడుగా వెళ్లాడు. తలకి పెద్ద దెబ్బ తగిలింది. రెండు మూడు చోట్ల ఎముకలు విరిగాయన్నారు. రక్తం బాగా పోయింది. ఏమవుద్దో యేమో."

మధుకి ఆ పిల్లాడి బ్రతుకు గురించి భయమేసింది. ఒక్కసారి తన పట్ల తనకే అసహ్యం కలిగింది. ఇప్పటికైనా వాళ్లకి సాయపడకపోతే తనకి నిష్కృతి లేదు.

ఇంకా ఆలస్యం చెయ్యదలుచుకోలేదు మధు. గుంటూరు దూరం. శరీరం నీరసంగా ఉంది. పైన ఎండ. అయినా మనస్సు గట్టి చేసుకొని వెంటనే బయల్దేరాడు. కృష్ణారావు ఆఫీసుకి వెళ్లి కలుపుకు వెళ్దామా అని ఒక్క క్షణం అనిపించింది. 'వాడికి సెలవు దొరుకుతుందో లేదో, పైగా ఇంకా ఆలస్యమైపోతుంది. ముందు వెళ్లొచ్చి తర్వాత కలుస్తాను వాణ్ణి' అనుకున్నాడు మళ్లీ.

ట్రంక్ రోడ్డులో వచ్చే పోయే లారీలు, బస్సుల గాలివిసుర్ల వల్ల ముఖమంతా కమిలిపోయింది. ఎండ మాడిపోతుంది. అయితే, ఇవేవీ గమనించే పరిస్థితిలో లేడు. కళ్ల ముందు ఆ పిల్లాడి రూపమే. తల్లి తప్ప ఎవరూ లేరు. అజాగ్రత్తగా యాక్సిడెంట్ చేసి వాళ్లనలా వదిలెయ్యటం ఎంత ఘోరం? అంతా ఒకటే ఆందోళన. ఎదురుగా పెద్ద లోడుతో లారీ. గమనించలేదు. చివరి క్షణంలో బైక్ చటుక్కున పక్కకి తిప్పాడు. అదుపు తప్పి రోడ్డుపక్కకి దూసుకెళ్లి, చింతచెట్టుకి గుద్దుకుంది. కింద పడ్డాడు తను. తనమీద బండి పడింది, యముడి దున్నలాగా. కాలి కండ చీలి పెద్ద గాయం. నిప్పుకణికతో కోసినట్టు. పదునైన కత్తితో చీల్చినట్టు. ఒకటే నెత్తురు.... అచ్చంగా ఆ పిల్లాడి నెత్తురు మాదిరే.... ఎర్రగానే.

మెల్లగా లేచి కూర్చున్నాడు. జేబులో రుమాలు తీసి, నెత్తురు కారకుండా కాలికి కట్టు కట్టుకున్నాడు. విపరీతమైన బాధని సహిస్తూ బైక్‌ని లేపాడు. అదృష్టవశాత్తు స్టార్టయ్యింది.

గుంటూరులో మధు పని కష్టమైంది. జనరల్ హాస్పిటల్‌లో వాళ్లు దొరకలేదు. ఏం చెయ్యాలో తోచలేదు. ఈ సమయంలో కృష్ణారావు తోడుంటే బాగుండేది. ఏ డాక్టర్ దగ్గరికి వెళ్లుంటారు? బహుశ ఏ ఆర్థోపెడిస్ట్ దగ్గరికో వెళ్లి ఉండాలి. ఇలా ఆలోచించి ఒక మందుల షాపుకి వెళ్లి, నగరం లోని ఎముకల స్పెషలిస్టుల గురించి అడిగాడు. తెలిసిన పేర్ల ప్రకారం నాలుగైదు హాస్పిటల్స్‌కి వెళ్లి కనుక్కున్నాడు. నిరాశే ఎదురైంది. పొట్టలో ఎత్తు లేదు. ఒకటే నీరసం. కాలి నెత్తురు కారటం ఆగిపోయింది గాని ఒకటే సలుపు. దాని సంగతి తర్వాత చూడొచ్చు. ఇంకొక్క డాక్టరు పేరు మిగిలింది. అక్కడికి వెళ్తే సరిపోతుందేమో అనుకున్నాడు.

అశ్విని హాస్పిటల్ ముందు బండి ఆపాడు. లోపలికి వెళ్లి కన్పించిన నర్సు నడిగాడు.

"ఓ, తెనాలి నుంచి వచ్చిన కేసేగా? బైక్ యాక్సిడెంట్. రూం నెంబర్ తొమ్మిది. డాక్టర్ గార్ని కలవండి. వివరంగా చెపుతారు." అన్నదామె.

వెంటనే డాక్టర్‌ని కలిశాడు మధు.

"మల్టిపుల్ ఫ్రాక్చర్స్. ఎవడో రాస్కెల్ గుద్దేసి వెళ్లిపోయాడు. కుర్రాడి పరిస్థితి ఇంకా ఇరవై నాలుగు గంటలు గడిస్తే గాని చెప్పలేం. ప్రస్తుతం ఇంటెన్సివ్ కేర్‌లో ఉన్నాడు. అతనికి మీరేమవుతారు?"

ఏమి చెప్పటానికీ నోరు పెగల్లేదు మధుకి. చాలా మానసికవ్యథ కలిగింది. కళ్ల వెంట నీళ్లు తిరిగాయి. మెల్లగా నడిచి తొమ్మిదో గది వద్ద ఆగాడు. తలుపు ఓరగా వేసి ఉంది. తలుపు సందులోంచి బెడ్ మీద బేండేజీ కట్లతో పడుకొని ఉన్న చిన్న ఆకారం కనిపించింది. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. కాసేపు తటపటాయించాడు.

ఆ తర్వాత దృఢ నిశ్చయంతో ధైర్యంగా లోపలికి అడుగుపెట్టాడు.